సాక్షి
ప్రకాశం
మంగళవారం । 4 । మార్చి । 2025



సర్వేలపై అలసత్వం వహిస్తే చర్యలు

జిల్లాలో నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ సర్వే, పీ4 సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. - 8లో..



ఉద్యోగాల పేరుతో మోసం

ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో విధులు నిర్వహించే ఉద్యోగి ఉద్యోగాలిప్పిస్తానని పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

రంజాన్ వేళలు

మంగళవారం ఇఫ్తార్
సాయంత్రం గం 6 : 26
బుధవారం సహారి
ఉదయం గం 5 : 07

న్యూస్‌రీల్

ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్మీడియెట్ పరీక్షలు సోమవారం ఇంగ్లిష్ సబ్జెక్టుతో ప్రారంభమైనట్లు డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 3702 నుంచి విద్యార్థులను గాను 2,846 మంది హాజరవగా, 856 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. 21 పరీక్ష కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌లను, ఐదు ఫ్లయింగ్‌స్క్వాడ్ టీమ్‌లను నియమించారు. స్థానిక ఎంఈఓ లను, ప్రధానోపాధ్యాయులను 21 పరీక్షా కేంద్రాల్లో పర్యవేక్షణకు నియమించారు. స్క్వాడ్ ఆఫీసర్స్ 21 పరీక్ష కేంద్రాలను సందర్శించారు. డీఈఓ కిరణ్‌కుమార్ మూడు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కట్టు దిట్టమైన చర్యలతో పకడ్బందీగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా జిల్లాలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ

ఒంగోలు సిటీ: సీనియారిటీ జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఈ నెల 9వ తేదీ లోపల సంబంధిత జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి సమర్పించాలని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలు సంబంధిత జిల్లా విద్యాశాఖ/ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో, నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అభ్యంతరాల సమర్పణకు అవసరమైన వివరాలను అభ్యంతరం చేసే ఉపాధ్యాయుడి పూర్తి పేరు, పదవి, సంబంధిత వివరాలు, సీనియారిటీ జాబితా లో తప్పిదం ఎక్కడ ఉందో స్పష్టంగా పేర్కొనాలన్నారు. అలాగే ఆధారాలు లేదా సంబంధిత సాక్ష్యాలు జత చేయాలన్నారు. ఫిర్యాదుల పరిష్కార కమిటీ అభ్యంతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకొని సంబంధిత ప్రధానోపాధ్యాయులు/ఉపాధ్యాయులకు తెలియజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు సంబంధిత జిల్లా విద్యాశాఖ / జోనల్ విద్యాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో తృతీయ స్థానంలో ప్రకాశం

ఒంగోలు: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రకాశం క్రీడాకారులు ఓవరాల్ ఛాంపియన్ తృతీయ స్థానంను కైవసం చేసుకున్నారు. కృష్ణాజిల్లా కంచికచర్లలోని ఏకత్వ పాఠశాల ఆవరణలో ఈనెల 1వ తేదీ ప్రారంభమైన అండర్ 14 సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ స్థానాన్ని కైవసం చేసుకున్నారని ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.నవీన్ తెలిపారు. సత్తాచాటిన క్రీడాకారులను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, కోచ్‌లు డి.రాజు, జి.అనీల్ అభినందించారు.

ఫాయల్ బ్రాంజ్ మెడల్ సాధించిన బాలురు:
జె.జగదీశ్వర్, టి.అలితేష్, సీహెచ్ జ్ఞానేశ్వర్

ఈపీ విభాగం

బంగారు పతకం సాధించిన బాలురు:
టి.శ్రీసాయి చరణ్, ఎస్‌కె అయాన్ మహిద్, డి.చరణ్‌సాయి ఫణీశ్వర్

ఈపీ విభాగంలో స్వర్ణాలు సాధించిన బాలికలు:
టి.మితుల చౌదరి, డి.షణ్ముక ప్రియ, డి.వెంకట సౌమ్యశ్రీ

శాబర్‌లో కాంస్యం సాధించిన బాలికలు:
వి.లేఖన, వి.జ్యోతిక, పి.చక్రిక

తల్లి మృతిని తట్టుకోలేక కుమార్తె ఆత్మహత్య

కొండపి: తల్లి మృతిని తట్టుకోలేక కుమార్తె ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొండపి మండలంలోని నేతివారిపాలెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నేతివారిపాలెం గ్రామానికి చెందిన వల్లపు జ్యోతి (19) తల్లి లక్ష్మి రెండు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందడంతో అప్పటి నుంచి తల్లి మీద బెంగ పెట్టుకొని ఇంట్లో ఎవరితో మాట్లాడకుండా ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి మాలకొండయ్య ఇంటికి వెళ్లే సరికి ఉరికి వేలాడుతూ ఉంది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రేమ్ కుమార్ తెలిపారు. జ్యోతి డిప్లొమా చదివింది. ఆమెకు ఇద్దరు అక్కలు, ఒక అన్న ఉన్నారు. ఇద్దరు అక్కలకు వివాహమైంది.

పచ్చ సైన్యం.. ఇసుక ఇజం!



జిల్లాలో ఇసుకాసురుల ఆగడాలకు అంతేలేకుండా పోతోంది. కూటమి పార్టీల నేతలు బరితెగించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని రెచ్చిపోతున్నారు. ప్రైవేటు సైన్యాన్ని పెట్టుకుని అరాచకాలు సృష్టిస్తున్నారు. ఎక్కడ నుంచి ఇసుక తెచ్చుకున్నా మా యార్డులో దించాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. బలవంతంగా యార్డులో దించుతున్నారు. కాదంటే భౌతిక దాడులకు తెగబడుతున్నారు. అంతా అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో జరుగుతుండటంతో సంబంధిత శాఖల అధికారులు మౌనవ్రతం పాటిస్తున్నారు. సహనం నశించిన లారీ యజమానులు సోమవారం ఏకంగా ఒంగోలులో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.

- జిల్లాలో పేట్రేగిపోతున్న ఇసుకాసురులు
- ప్రైవేటు సైన్యంతో నిఘా పెట్టి మరీ వేధింపులు
- వ్యాపారులపై దాడులతో భయభ్రాంతులకు గురిచేస్తున్న వైనం
- కార్గిల్ సైనికుడిని సైతం వదలకుండా ఇబ్బందులు పెడుతున్న ఇసుకాసురులు
- పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- ఒంగోలులో కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగిన టిప్పర్ యజమానులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఇసుక మాఫియా దౌర్జన్యాలకు తెగబడుతోంది. పట్టపగలే రెచ్చిపోయి రౌడీయిజం చేస్తోంది. నగరంలోని కొప్పోలు హైవే వద్ద ఇసుక యార్డు ఏర్పాటు చేశారు. నెల్లూరు రీచ్ నుంచి ఇక్కడకు ఇసుక తరలించి విక్రయాలు జరుపుతుంటారు. జిల్లాలో కొందరు టిప్పర్ యజమానులు పదేళ్లుగా ఇసుక వ్యాపారం చేస్తున్నారు. ఒంగోలు, దర్శి, కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం, పొదిలి, చీమకుర్తి తదితర ప్రాంతాల్లో ఇసుక విక్రయాలు చేస్తుంటారు. గృహనిర్మాణదారులు నేరుగా ఆన్‌లైన్లో ఇసుక బుక్ చేసుకునే వెసులుబాటు ఉండడంతో వారికి తక్కువ ధరకే ఇసుక సరఫరా చేస్తున్నారు. టిప్పర్ యజమానులు టన్నుకు రూ.600 తీసుకుంటుండగా యార్డులో మాత్రం టన్నుకు రూ.850కిపైగా వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. దీంతో గృహనిర్మాణదారులు అనేకమంది స్వయంగా ఆన్‌లైన్‌లోనే ఇసుక బుక్ చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లించి బిల్లులతో ఒంగోలుకు తరలిస్తున్నారు. దీనిని సైతం ఇసుక మాఫియా అడ్డుకుంటోంది. 100 మంది ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసి నగరంలో సొంతంగా నిఘా పెట్టి దాడులకు పాల్పడుతోంది. నగరంలోని గుంటూరు రోడ్డు బైపాస్‌లో కిమ్స్ హాస్పిటల్ వద్ద ఒక **బ్యాచ్**, నెల్లూరు రోడ్డులోని బైపాస్ వద్ద **సంఘమిత్ర** హాస్పిటల్ వద్ద ఒక **బ్యాచ్**, కర్నూలు రోడ్డు ఫ్లై ఓవర్ బ్రిడ్జి **వద్ద** మరొక బ్యాచ్‌తో నిఘా పెడుతున్నారు. నెల్లూరు నుంచి బిల్లులతో వచ్చే లారీలు, టిప్పర్లను అడ్డుకుని డ్రైవర్లను చితకబాది భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అంతటితో ఊరుకోకుండా బలవంతంగా లారీలను తీసుకెళ్లి యార్డులో ఇసుక డంప్ చేసుకుంటున్నారని టిప్పర్ యజమానులు వాపోతున్నారు.



ఒంగోలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఇసుక లారీ యజమానులు

పోలీసుల నో యాక్షన్...

నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఇసుక **మాఫియా** రెచ్చిపోతున్నా పోలీసులు మాత్రం ఎ**లాంటి చర్యలు** తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లు**వెత్తుతున్నాయి.** ఒక్క ఒంగోలులోనే కాకుండా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఇసుక మాఫియా ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని దౌర్జన్యాలకు పాల్పడుతున్నప్పటికీ పోలీసులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఒంగోలులో 100 మంది ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని టిప్పర్ యజమానులు, గృహనిర్మాణదారులపై దాడులకు పాల్పడుతున్నా.. మాకేమీ తెలియదని చెబుతున్నారంటే పోలీసుల మీద అధికార పార్టీ ఎమ్మెల్యేల ఒత్తిడి ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. టిప్పర్ యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోగా ఎదురుగా తమనే బెదిరిస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటి వరకు కనీసం ఒక్కరి మీదైనా చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కార్గిల్ సైనికుడినీ వదిలిపెట్టని మాఫియా...

సంతనూతలపాడు మండలంలోని మైనంపాడుకు చెందిన ఆకుల మోహన్‌రావు దేశ సరిహద్దుల్లో సైనికుడిగా పనిచేశారు. 1998లో జరిగిన కార్గిల్ పోరాటంలో శత్రు దేశానికి వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడారు. భూమికి 5140 అడుగుల ఎత్తులో ఉన్న టోలోలింగ్ పర్వతంపైన బోఫోర్స్ తుపాకీతో పోరాడారు. 2000 సంవత్సరంలో రిటైర్డ్ అయిన మోహన్‌రావు స్వగ్రామానికి చేరుకుని లారీ కొనుక్కున్నారు. పదేళ్లుగా ఇసుక విక్రయిస్తున్నారు. ఏనాడూ ఇలాంటి పరిస్థితి చూడలేదని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో దారుణంగా తయారైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జనవరిలో ఆయన టిప్పర్ ఆపిన ఇసుక మాఫియా.. డ్రైవర్‌ను చితకబాది టిప్పర్ తీసుకెళ్లి మూడు రోజుల పాటు యార్డులో నిర్బంధించారు.



ఒంగోలు ఇసుక యార్డులో నిర్బంధించిన కార్గిల్ యుద్ధ సైనికుడి టిప్పర్



దర్శి వద్ద ఇసుక మాఫియా విధ్వంసం సృష్టించి అద్దాలు పగులగొట్టిన ఇసుక లారీ

ఇష్టారాజ్యంగా లారీల నిర్బంధం ...

చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న ఇసుక మాఫియా రోజురోజుకూ మరింత రెచ్చిపోతోందని టిప్పర్ యజమానులు ఆరోపిస్తున్నారు. గతేడాది డిసెంబర్ 5వ తేదీ నెల్లూరు నుంచి బిల్లులతో వస్తున్న ఇసుక లారీని కిమ్స్ హాస్పిటల్ వద్ద మూడు రోజుల పాటు ఆపేసి లారీ యజమానిని ఇబ్బం**దుల**కు గురిచేసినట్టు సమాచారం. ఈ ఏడాది **జనవ**రి 28వ తేదీ కూడా ఒక టిప్పర్‌ను ఆపి డ్రైవ**ర్‌ను** చితకబాది లారీ అద్దాలను పగులగొట్టినట్లు **ఆరో**పణలు ఉన్నాయి. అంతటితో ఊరుకోకుండా **లారీ**ని తీసుకెళ్లి యార్డులో మూడు రోజులపాటు **నిర్బ**ంధించినట్లు తెలిసింది. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని టిప్పర్ యజమాని ఆకుల మోహన్‌రావు తెలిపారు. ఫిబ్రవరి 23వ తేదీ దర్శిలో మరోలారీపై ఇసుక మాఫియా దాడి చేసి అద్దాలు పగులగొట్టింది. దర్శి ఇసుక యార్డుకు సంబంధించిన 15 మంది ప్రైవేటు సైన్యం బిల్లులతో వస్తున్న లారీని అడ్డుకుని విధ్వంసం **సృ**ష్టించారు. లారీ అద్దాలను పగులగొట్ట**డమే** కాకుండా టైర్లను కత్తితో కోసేశారు. **లారీ** డ్రైవర్‌ను క్రూరంగా హింసించారు. ఈ **దాడి**పై ఫిర్యాదు చేసేందుకు పోలీసుస్టేషన్‌కు **వెళ్లగా**, అక్కడకు కూడా వచ్చిన ప్రైవేటు సైన్యం **ఎస్ఐ** ముందే దాడి చేస్తామని బెదిరింపులకు **దిగడ**ం గమనార్హం. ఫిబ్రవరి 24వ తేదీ పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు వద్ద ఇసుక మాఫియా లారీని ఆపి రచ్చ చేసినట్లు సమాచారం. ఈ ప్రభుత్వం మాది, మా ఇష్టం వచ్చినట్లు చేస్తాం, నీ ఇష్టం వచ్చిన వాడికి చెప్పుకోమంటూ సవాల్ విసరినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేసేదేమీ లేక టన్నుకు రూ.250 చొప్పున కప్పం కట్టి లారీని విడిపించుకున్నట్లు తెలిసింది. గత మూడు నెలల్లో ఇలాంటి ఘటనలు సుమారు 15 నుంచి 20కిపైగా ఉన్నట్లు సమాచారం. దీంతో లారీ డ్రైవర్లు డ్యూటీలకు వెళ్లాలంటేనే ప్రాణభయంతో వణికిపోతున్నారు. లారీ యజమానులు కూడా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని టిప్పర్ల అసోసియేషన్ నాయకులు ఆరోపిస్తున్నారు.

ఆప్కాస్ రద్దుపై భగ్గుమన్న కార్మికులు

- కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ధర్నా

ఒంగోలు టౌన్: ఆప్కాస్‌ను రద్దు చేయాలన్న కూటమి ప్రభుత్వం నిర్ణయంపై కార్మికులు రోడ్డెక్కారు. మున్సిపల్ కార్మికుల జీవితాలను కాంట్రాక్టర్లకు అప్పగించే ప్రయత్నాలపై మండిపడ్డారు. కోవిడ్ ఆపద సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించిన మున్సిపల్ కార్మికుల బతుకులతో రాష్ట్ర ప్రభుత్వం ఆటలాడుతోందని కార్మిక నాయకులు విమర్శించారు. కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర నాయకులు ఎస్‌డీ సర్దార్ మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేయాలన్న ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు మెరుగైన జీతాలు ఇస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత అసలుకే ఎసరు పెట్టే చర్యలకు ఉపక్రమించడం దుర్మార్గం అన్నారు. కరోనా సమయంలో మున్సిపల్ కార్మికులు చేసిన సేవలను మరిచి పోవడం ఎంత మాత్రం సమర్థనీయం కాదన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కార్మికులపై రాజకీయ జోక్యాన్ని నిలువరించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులను ప్రైవేటు కాంట్రాక్టులకు అప్పగిస్తే జీతాలు, పీఎఫ్‌లు సక్రమంగా రావని, కార్మిక హక్కులను కాలరాస్తారని చెప్పారు. కార్మిక వర్గం శ్రమదోపిడీకి గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులందరికీ ఇళ్ల స్థలాలను ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులను రాజకీయ వేధింపులకు గురిచేయడం ఎక్కువై పోయిందని యూనియన్ జిల్లా నాయకుడు శ్రీరామ్ శ్రీనివాసరావు విమర్శించారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాల్సి వస్తుందనే ఆప్కాస్‌ను రద్దు చేసే కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు ఆదినారాయణ, హరిబాబు, ఎంఏ సాలార్, చెన్నయ్య, వెంకటేశ్వర్లు, గోపి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ప్రైవేటు నరకంలోకి నెట్టొద్దు: సీఐటీయూ డిమాండ్

ఆప్కాస్‌ను రద్దు చేసి కార్మికులను ప్రైవేటు నరకంలోకి నెట్టొద్దని సీఐటీయూ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం యూనియన్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ విజన్ అంటూ గొప్పలు చెబుతోందని, కార్మికులు పనిచేయకపోతే స్వచ్ఛ ఆంధ్ర ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం వలన కార్మికులు అనేక ఇబ్బందులు పడతారని చెప్పారు. సమ్మెకాల ఒప్పందాలను అమలు చేయాలని, ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ విజయవాడలో జరిగే ధర్నాలో జిల్లా కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టి.మహేష్, విజయమ్మ, కె.సామ్రాజ్యం, ఎం.బాబు, దివ్య, జేమ్స్, భారతి, కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

బాలికల హక్కులను పరిరక్షించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: బాలికలు స్వేచ్ఛగా ఎదిగేలా వారి హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఒంగోలులోని ప్రభుత్వ ఆస్పత్రి (రిమ్స్) నుంచి నెల్లూరు బస్టాండ్ సెంటర్ వరకూ నిర్వహించిన క్యాండిల్ ర్యాలీని ఆమె ప్రారంభించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో మహిళలు, నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు సుమారు వెయ్యి మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వారోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఒక ఇతివృత్తంతో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే 'బాల్యవివాహాల రహిత ప్రకాశం జిల్లా' ఆవిష్కరణ కోసం ప్రజల్లో చైతన్యం కలిగించేలా ఈ క్యాండిల్ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. కనీసం 18 ఏళ్లు నిండే వరకూ ఆడపిల్లలకు వివాహం చేయకుండా వారిని చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. బాల్యవివాహం చేసుకోబోనని ప్రతి ఆడపిల్ల కూడా సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. బాలికల ఆరోగ్యం, హక్కులను కాపాడేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్, సీడీపీవోలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశాలు, ఏఎన్ఎంలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీగా వెళుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ఒంగోలు సిటీ: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' లో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన ‘మీ కోసం' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ వీటిని ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించాలని స్పష్టం చేశారు. 'మీ కోసం' కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి ఒక్క అర్జీ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితిల్లో అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని ఆదేశించారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్ లైన్ లో వచ్చిన వినతులను చూడాలని చెప్పారు. సాంకేతిక సమస్యల వలన క్షేత్రస్థాయిలో పరిష్కరించలేని అర్జీలు వస్తే ఆ విషయాన్ని ప్రజలకు అప్పుడే స్పష్టం చేయాలన్నారు. ఒంగోలు నియోజకవర్గం యరజర్ల, కొణిజేడు నుంచి వందల టిప్పర్లతో రోడ్లు మొత్తం నాశనం చేస్తూ శబ్ద కాలుష్యం సృష్టిస్తూ జరుగుతున్న అక్రమ మైనింగ్ మాఫియా మీద చర్యలు తీసుకోవాలని కలెక్టరుకు స్థానికులు అర్జీ ఇచ్చారు. కలెక్టరు వెంటనే మైనింగ్ మాఫియా మీద చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో బి.చిన ఓబులేసు, డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, పార్థసారథి, వరకుమార్, విజయ జ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా





పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న ఇంటర్ సెకండియర్ విద్యార్థులు



తమ నంబర్లు ఏ గదిలో ఉన్నాయో చూసుకుంటున్న విద్యార్థినులు

విజయోస్తు

- ప్రశాంతంగా ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు
- గైర్హాజరైన 763 మంది విద్యార్థులు

ఒంగోలు సిటీ: ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అధికారులు ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసి పకడ్బందీగా నిర్వహించారు. మొదటి రోజు ఇంటర్ రెండో సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పేపర్ 2 పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మొదటి రోజు 19213 మందికి గాను 18450 మంది విద్యార్థులు హాజరయ్యారు. 763 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ 17,252 మంది విద్యార్థులకు గాను 16,659 మంది హాజరవగా, 593 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకుగాను 1961 మందికి గాను 1791 మంది విద్యార్థులు హాజరవగా 170 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు నిర్వహించడానికి జిల్లాలో 67 సెంటర్లు కేటాయించారు. ఆర్ఐఓలు ఐదుగురు, 10 మంది డీఈసీ–డీఐఈఓలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. 33 మంది స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

క్లుప్తంగా

ఆటో డ్రైవర్ నిజాయితీ

● ల్యాప్‌టాప్ బ్యాగ్ పోలీస్‌స్టేషన్‌లో అందజేత



ల్యాప్‌టాప్ బ్యాగును ఎస్సైకి అందజేస్తున్న ఆటోడ్రైవర్ నారాయణ

పామూరు: ఆటోడ్రైవర్ నిజాయితీని చాటుకున్నాడు. తనదికాని వస్తువు అవసరం లేదంటూ దానిని పోలీసులకు అప్పజెప్పాడు. వివరాలు.. మండల కేంద్రమైన పామూరు విరాట్‌నగర్ జంక్షన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ల్యాప్‌టాప్ బ్యాగును పోగొట్టుకోగా రోడ్డుపై పడిఉంది. అదే సమయంలో అటుగా వెళ్తున్న పామూరుకు చెందిన ఆటోడ్రైవర్ లక్కనబోయిన నారాయణ బ్యాగును చూసి దానిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి ఎస్సై టి.కిషోర్‌బాబుకు అందజేశారు. ఆటోడ్రైవర్‌ను ఎస్సై అభినందించారు. ల్యాప్‌టాప్ పోగొట్టుకున్నవారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

'ఏకేయూ పరిశోధక నిబంధనావళి' ఆవిష్కరణ


ఏకేయూ పరిశోధక నిబంధనావళి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు సిటీ: ఆంధ్ర కేసరి యూనివర్సిటీలో పీహెచ్‌డీ స్కాలర్లు, వారికి సూచనలు, సలహాలిచ్చే రీసెర్చ్ డైరెక్టర్లకు దిక్సూచిగా ఉపయోగపడేలా 'ఏకేయూ పరిశోధక నిబంధనావళి'ని రూపొందించారు. ఈ పుస్తకాన్ని సోమవారం సాయంత్రం వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబుతో కలిసి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. యూనివర్సిటీ రీసెర్చ్ విభాగంలో భవిష్యత్ అవసరాల కోసం ఈ నిబంధనావళి మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. ఆంధ్ర కేసరి యూనివర్సిటీ పరిధిలో పరిశోధకులు, పరిశోధనలో భాగస్వాములైన రీసెర్చ్ డైరెక్టర్లను దృష్టిలో ఉంచుకుని నిబంధనావళిని రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఏకేయూ పరిధిలో మొత్తం 52 మంది విద్యార్థులు తమ పరిశోధనలను కొనసాగిస్తున్నట్లు వర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డైరెక్టర్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.నిర్మలామణి వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజమోహన్ రావు, సీడీసీ డీన్ ప్రొఫెసర్ సోమశేఖర తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీలో జారిపడి వ్యక్తి మృతి


మృతి చెందిన వెంకటేశ్వరరావు

మార్కాపురం: డ్రైయినేజీలో జారిపడటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి వేళ మార్కాపురం పట్టణంలోని రామలక్ష్మణ వీధిలో చోటుచేసుకుంది. వివరాలు.. రామలక్ష్మణ వీధిలో నివాసం ఉండే తాడి వెంకటేశ్వరరావు(39) ప్లంబర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటికి వెళ్లే క్రమంలో చీకటిలో కాలుజారి డ్రైయినేజీలో పడిపోయాడు. డ్రైయినేజీలో ఉన్న రాయి తగలడంతో తలకు బలమైన గాయమై రక్తస్రావమైంది. కాసేపటి తర్వాత దారినపోయేవారు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. అప్పటికే వెంకటేశ్వరరావు మృతి చెందినట్లు పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జలపాతంలో పడి కడితి మృతి


కడితికి పోస్టుమార్టం చేస్తున్న డాక్టర్ మునీర్

సీఎస్‌పురం(పామూరు): భైరవకోన కొండపైనుంచి కడితి ప్రమాదవశాత్తు జలపాతంలో జారిపడి మృత్యువాత పడింది. ఈ సంఘటన సోమవారం వెలుగు చూసింది. ఆలయ సిబ్బంది ద్వారా సమాచారం అందుకున్న అటవీశాఖ కనిగిరి ఎఫ్ఆర్ఓ టి.ఉమామహేశ్వరరెడ్డి, ఎఫ్ఎస్ఓ షేక్.అలీమ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కడితిని బయటకు తీయించి, పశువైద్యాధికారి షేక్.మునీర్‌తో పోస్టుమార్టం చేయించారు. అనంతరం కడితి కళేబరాన్ని ఖననం చేశారు. అంబవరం ఎఫ్‌బీఓ డి.బ్రహ్మయ్య, వైద్య సిబ్బంది రాజేష్, ఆదినారాయణ పాల్గొన్నారు.

సర్వేలపై అలసత్వం వహిస్తే చర్యలు

● కలెక్టర్ తమీమ్ అన్సారియా


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: జిల్లాలో నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ సర్వే, పీ4 సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని, అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తమీమ్ అన్సారియా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలను హెచ్చరించారు. గృహ నిర్మాణాల పురోగతి, ఎంఎస్ఎంఈ సర్వే, పీ4 సర్వే, మిస్సింగ్ సిటిజన్స్ మ్యాపింగ్, సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్, గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య ఏర్పాట్లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు, జాతీయ ఉపాధి హామీ పథకం అమలు, స్కూల్ టాయిలెట్ల ఇన్‌స్పెక్షన్, తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఏపీవోలతో సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి నిర్వహించిన ఈ సమీక్షలో పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ సర్వేను ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పీ4 సర్వేను కూడా ఈ నెల 4వ తేదీలోపే పూర్తి చేయాలని చెప్పారు. నిర్దేశించిన గడువులోగా సర్వేలు పూర్తిచేయకుండా అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ నిర్మాణ పథకంలో లబ్ధిదారులు వేగంగా ఇళ్లు నిర్మించుకునేందుకు చర్యలు చేపట్టడంతో పాటు అవసరమైన వారికి త్వరగా పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సచివాలయ సిబ్బంది వంద శాతం బయోమెట్రిక్ హాజరు వేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరుపై ప్రతిరోజూ మానిటరింగ్ చేయాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. గృహనిర్మాణాలకు సంబంధించి 90 రోజుల పని దినాలను లక్ష్యం మేరకు కల్పించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఎంపీడీఓలు, ఏపీడీలు క్షేత్రస్థాయిలో పర్యటించి ఉపాధి హామీ పనులను పర్యవేక్షించడంతో పాటు పథకం కింద కేటాయించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా దృష్టి సారించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖాధికారి శ్రీనివాసరావు, డీపీఓ వెంకటనాయుడు, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, సీపీఓ వేంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కూతుర్ని చూసేందుకు వచ్చి..

● ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి
● వినుకొండ నుంచి ఆర్టీసీ బస్సులో ఒంగోలు రాగా, అదే బస్సు రివర్స్ చేస్తూ ఢీకొని దుర్మరణం


మరణించిన నాగేంద్రమ్మ

ఒంగోలు టౌన్: విధి విచిత్రమైనది. ఎప్పుడు ఎవరిని ఎలా కాటేస్తోందో తెలియదు. కూతుర్ని చూడాలని వినుకొండ నుంచి ఒంగోలుకు ఆర్టీసీ బస్సులో వచ్చిన ఓ వృద్ధురాలు అదే బస్సు ఢీకొనడంతో మృతి చెందింది. సోమవారం ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన చేవూరి నాగేంద్రమ్మ (69)కు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండో సంతానమైన నాగమణి సంతనూతలపాడు మండలంలోని బోడపాలెంలో నివసిస్తోంది. నాగేంద్రమ్మ తరచూ కూతురిని చూసేందుకు వచ్చివెళ్తుంటుంది. వినుకొండలో ఆమెను బస్సు ఎక్కించి ఒంగోలు పంపడం.. కూతురు నాగమణి ఒంగోలు వచ్చి తల్లిని బోడపాలెం తీసుకెళ్లడం జరుగుతుంటుంది. అయితే, ఈసారి మాత్రం విధి ఆడిన ఆటలో ఆ తల్లి కూతురి వద్దకు చేరలేదు. ఒంగోలులోనే తిరిగిరాని లోకాలకు చేరింది. వినుకొండ నుంచి ఒంగోలుకు ఆమె వచ్చిన ఆర్టీసీ బస్సే రివర్స్ చేస్తూ.. అప్పుడే బస్సు దిగి వెనుక నుంచి వెళ్తున్న నాగేంద్రమ్మను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేంద్రమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. అప్పటికే నాగమణి ఒంగోలు ఆర్టీసీ డిపోకు వచ్చి తల్లి కోసం ఎదురుచూడసాగింది. ఆ సమయంలో ఒక అంబులెన్స్ వచ్చి ఆగింది. సమీపంలో జనం గుమిగూడి ఉన్నారు. దాంతో డిపోలో నిలబడి ఉన్న ప్రయాణికులను అక్కడ ఏం జరుగుతోందని నాగమణి అడిగింది. ఎవరో ముసలావిడ చనిపోయిందని చెప్పడంతో అనుమానం వచ్చి దగ్గరకు వెళ్లి చూడగా, నాగేంద్రమ్మ నిర్జీవంగా పడి ఉంది. ఊహించని ఘటనతో నివ్వెరపోయిన నాగమణి.. తల్లి మృతదేహం మీద పడి విలపించడం అక్కడున్న వారితో సైతం కన్నీరు పెట్టించింది. నాగేంద్రమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే వినుకొండ టీడీపీ నాయకులు పలువురు ఒంగోలు చేరుకుని కేసు నమోదు చేయవద్దంటూ పోలీసులు, బాధితులపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.

ఉద్యోగాల పేరుతో మోసం

● ఎంప్లాయిమెంట్ కార్యాలయ ఉద్యోగిపై
● ఎస్పీకి బాధితుల ఫిర్యాదు


బాధిత వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: ఎంప్లాయిమెంటు కార్యాలయంలో విధులు నిర్వహించే ఒక ఉద్యోగి ఉద్యోగాలిప్పిస్తానంటూ పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు దర్శికి చెందిన బాధితులు ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీని కలిసి తమకు జరిగిన మోసాన్ని తెలియజేశారు. దర్శి ప్రాంతానికి చెందిన ఆరుగురికి ఉద్యోగాలిప్పిస్తానంటూ ఎంప్లాయిమెంటు ఆఫీసు ఉద్యోగి ఒకరు ఒక్కొక్కరి నుంచి రూ.1.50 లక్షల చొప్పున మొత్తం 9 లక్షల రూపాయల వరకు వసూలు చేసినట్లు తెలిపారు. ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేయడంతో తమ దగ్గర వసూలు చేసిన డబ్బు తిరిగివ్వమని అడుగుతుంటే జవాబు చెప్పడం లేదని వాపోయారు. తమకు న్యాయం చేయాలని, మోసానికి పాల్పడిన ఉద్యోగిని కఠినంగా శిక్షించాలని కోరారు. అలాగే, గృహం కొనుగోలు కోసమంటూ అప్పుగా డబ్బు తీసుకుని తిరిగివ్వమంటే దాడి చేయడానికి వస్తున్నారని నేలటూరు గ్రామానికి చెందిన ఒక మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మూడు నాలుగు నెలల్లో తిరిగిస్తానని చెప్పడంతో తన కుమార్తె చదువు, వివాహం కోసం దాచుకున్న రూ.5 లక్షలు ఇచ్చానని, మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ డబ్బు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 78 మంది బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదు చేశారు. వారితో మాట్లాడిన ఎస్పీ ఆయా పోలీసు స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితులకు వెంటనే న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ సీఐ సుధాకర్, రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, సీసీఎస్ సీఐ జగదీష్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, వేదిక ఎస్సైలు షేక్ రజియా సుల్తానా, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షల కోసం ఏర్పాటు చేసిన 67 కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. సోమవారం ఆయన ఒంగోలు నగరంలో ఇంటర్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ.. పరీక్ష సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రశ్న పత్రాల తరలింపు, సమాధాన పత్రాలు డిపాజిట్ చేయడానికి తగిన ఎస్కార్ట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కనీస వసతులు సమకూర్చాలని సంబంధిత అధికారులను సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, వన్‌టౌన్ సీఐ నాగరాజు, తాలుకా ఎస్సై సందీప్ తదితరులు ఉన్నారు.


రథం ముందు కోలాటం ప్రదర్శిస్తున్న మహిళా భక్తులు

హరహరా.. మార్కండేశ్వరా..

● శివనామ స్మరణతో మారుమోగిన మార్కాపురం
● వైభవంగా శివపార్వతుల రథోత్సవం


ప్రత్యేక అలంకారంలో శివపార్వతులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని మార్కండేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శివపార్వతుల రథోత్సవం భక్తుల శివనామ స్మరణల మధ్య అత్యంత వైభవంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి రథాన్ని నాలుగు మాఢ వీధుల్లో ఊరేగించారు. రాత్రి 7.30 గంటలకు శివపార్వతుల ఉత్సవమూర్తులను రథంపై ప్రతిష్ఠించి ప్రత్యేకంగా అలంకరించారు. ఈఓ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు తేజ శర్మ, ఆంజనేయశర్మ ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల జయజయ ధ్వానాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి రథోత్సవం శోభాయమానంగా సాగింది. చిన్నారులు, మహిళల కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది. స్వామివారిని వివిధ పార్టీల నాయకులు, అధికారులు, పుర ప్రజలు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పట్టణ ఎస్సై సైదుబాబు, రూరల్ ఎస్సై అంకమరావు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.


శివుని వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం

పర్చూరులో ఫారం-7తో ఓట్ల తొలగింపుపై సిట్

● ప్రకాశం ఎస్పీ నేతృత్వంలో ఇద్దరు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందం
● ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: బాపట్ల జిల్లా పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గంలో జీవించి ఉన్న ఓటర్లు మృతి చెందినట్లుగా పేర్కొంటూ ఫారం-7తో ఓట్ల తొలగింపునకు పాల్పడటంపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకాశం ఎస్పీ నేతృత్వంలో మరో ఇద్దరు సభ్యులతో సిట్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విజ్ఞప్తి ఆధారంగా సిట్ ఏర్పాటు చేసినట్లు ఉత్తర్వుల్లో తెలిపారు. 24,000 ఓట్లు తొలగింపునకు ఫారం-7 దరఖాస్తులను అక్రమంగా చేశారని, జీవించి ఉన్న వారు మృతి చెందినట్లు పేర్కొన్నారని ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడంతో గతంలోనే కేసు నమోదు చేశారు. అయితే ఎటువంటి చర్యలను తీసుకోలేదని, దీనిపై సిట్‌తో దర్యాప్తు చేయించాలని ఎమ్మెల్యే కోరినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రకాశం ఎస్పీ ఏఆర్ దామోదర్ నేతృత్వంలో గుంటూరు పశ్చిమ డీఎస్పీ అరవింద్‌తోపాటు డీజీపీ ద్వారా మరో అధికారిని నియమించుకుని దర్యాప్తు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సీఐడీ డీజీ ఆదేశాలు, పర్యవేక్షణలో సిట్ పనిచేయాలని పేర్కొన్నారు. సిట్ సాక్షులను, పత్రాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు చట్టానికి లోబడి నిందితులను అరెస్టు చేయడం, నిర్బంధించడం చేయవచ్చునని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దర్యాప్తు పురోగతికి సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు త్రైమాసిక నివేదికను సిట్ సమర్పించాలని స్పష్టం చేశారు.

మహిళా ఉద్యోగిపై ఏపీఎం వేధింపులు

● పోలీసులకు ఫిర్యాదు, కేసు నమోదు

పెద్దదోర్నాల: మహిళా ఉద్యోగిపై వేధింపులకు పాల్పడిన ఏపీఎంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వివరాల ప్రకారం.. మండలంలోని వెలుగు కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘంలోని విభాగంలో అకౌంటెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళ పట్ల ఏపీఎం దర్శనం పోలయ్య అసభ్యంగా ప్రవర్తించాడు. కొద్ది రోజుల నుంచి వేధింపులకు గురిచేస్తున్నాడు. దానికితోడు జీతం ఇవ్వాలంటే రూ.5 వేలు లంచం కావాలని కూడా డిమాండ్ చేశాడు. దీంతో బాధిత మహిళ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

టీడీపీ శ్రేణులకే దోచిపెట్టాలా?

● వైఎస్సార్ సీపీ వారికి పనిచేయవద్దని సీఎం చంద్రబాబు చెప్పడం అనైతికం
● వైఎస్సార్ సీపీ ఒంగోలు ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు ధ్వజం


చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ వాళ్లకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏ పనీ చేయవద్దని సీఎం చంద్రబాబు చెప్పడం అనైతికమని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు విమర్శించారు. శనివారం చిత్తూరు జిల్లాలో పర్యటించిన సీఎం చంద్రబాబు.. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఏ ఒక్క పనీ చేయకూడదని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం మంచి పద్ధతి కాదన్నారు. సోమవారం ఒంగోలులో రవిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ వాళ్లు మిమ్మల్ని అసలు పని ఎందుకు అడుగుతారని ప్రశ్నించారు. చంద్రబాబు వ్యాఖ్యలు గమనిస్తే టీడీపీ వాళ్లకు ఇల్లీగల్‌గా పనులు చేస్తున్నారని అర్థమవుతోందన్నారు. లీగల్‌గా ఎవరికైనా పనిచేయించుకునే హక్కు ఉంటుందన్నారు. పథకాల విషయంలోగానీ, పనుల విషయంలోగానీ, ఏదైనా లీగల్‌గా ఉండే పనులు అందరికీ ఒకేవిధంగా జరగాలన్నారు. ఇల్లీగల్ పనులు అయితేనే కదా మీరు ఇలా మాట్లాడుతోందంటూ రవిబాబు విమర్శించారు. మీ టీడీపీ వాళ్లకి దోచిపెడుతున్నారా చంద్రబాబూ..? అంటూ ప్రశ్నించారు. ఇల్లీగల్ పనులు మీ వరకే చేసుకోవాలి, పక్క పార్టీ వాళ్లకు కూడా చేయవద్దనేగా మీ ఉద్దేశమంటూ నిలదీశారు. మీ మాటలను బట్టి టీడీపీ వారు ఎంత ఇల్లీగల్‌గా సంపాదిస్తున్నారో చెప్పకనే చెబుతున్నారని విమర్శించారు. లీగల్‌గా రావాల్సిన, చేసుకోవాల్సిన పనులు ఏవైనా అందరికీ జరుగుతాయనీ, అనవసరంగా మీరు అడ్డం పడితే తప్ప ఆగవని అన్నారు. అడ్డం పెట్టడం అంటే మీరు అక్రమంగా అడ్డం పెట్టడం, ఇల్లీగల్‌గా ప్రవర్తించడమని గుర్తుపెట్టుకోండి చంద్రబాబు అంటూ రవిబాబు హితవు పలికారు.

రైతుల ఆనందమే నా ఆనందం

● పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు


బోర్డు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్‌బాబు

కొండపి: ప్రతి రైతు కష్టం నాకు తెలుసని, వారి ఆనందమే తన ఆనందమని పొగాకు బోర్డు (ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్) ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు అన్నారు. కొండపిలోని పొగాకు బోర్డును సోమవారం ఆయన సందర్శించారు. బోర్డు పరిసరాలను పరిశీలించారు. రాబోయే వేలం సీజన్‌కు సంబంధించిన పనులు, సంసిద్ధత గురించి బోర్డు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా పొగాకు బోర్డు సిబ్బందితో కలిసి బోర్డు ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పదోన్నతిపై వెళ్తున్న ఈడీని రైతులు సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. బోర్డు పరిధిలోని రైతులకు ఏడు సంవత్సరాలుగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. మూడు సంవత్సరాలుగా అనధికారికంగా అమ్మే పొగాకుకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా చేసి రైతుల కళ్లల్లో ఆనందం నింపిన వ్యక్తి అని అన్నారు. గతంలో పొగాకు రైతులు అమ్మిన బేళ్లకు నగదు 14 రోజుల్లో రైతుల ఖాతాలకు జమయ్యేదని, దానిని తొమ్మిది రోజులకే ఈడీ కుదించారని అన్నారు. కార్యక్రమంలో బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, ఒంగోలు ఆర్ఎం లక్ష్మణరావు, గుంటూరు వేలం నిర్వహణ అధికారి కే రామాంజనేయులు, కొండపి వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్, బోర్డు సిబ్బంది, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: బీసీ, ఈడబ్ల్యూఎస్ కులాలకు చెందిన మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఎం.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులాలకు చెందిన మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీ టైలరింగ్‌లో ఉచిత శిక్షణను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళలు సంబంధిత ఎంపీడీఓల కార్యాలయాల్లోగానీ, సచివాలయాల్లోగానీ యాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 90 రోజుల పాటు ఉచిత కుట్టు శిక్షణ పూర్తయిన తర్వాత కుట్టుమిషన్ అందిస్తామన్నారు. మహిళల వయస్సు 18 నుంచి 45 సంవత్సరాల్లోపు ఉండాలని సూచించారు.